పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పుట్టపర్తి మున్సిపాల్టీలో విజిలెన్స్ తనిఖీలు

కీలక రికార్డులు స్వాధీనం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు సోమవారం నాడు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ హయాంలో మున్సిపాల్టీలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయనే విమర్శలు వ్యక్తం అయిన నేపథ్యంలో ఈ తనిఖీలు జరిగాయి. పనులు చేయకుండానే బిల్లులు స్వాహా, చెత్తబుట్టలు పంపిణీ చేయకుండానే బిల్లులు కాజేత, చెత్త వాహనాల నిలిచిపోయినప్పటికీ డీజిల్ బిల్లులు చేయడం తదితర అక్రమాలు జరిగి పెద్ద ఎత్తున నిధులు కొల్లగొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలిటీలో జరిగిన అక్రమాలపై సాక్షాదారాలతో కూడిన ఫిర్యాదును గత ప్రభుత్వం అధికారంలో ఉండగానే విజిలెన్స్ అధికారులకు కౌన్సిల్ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. వైసిపి అధికారంలో ఉండడంతో అవినీతి అక్రమాల సంబంధించిన ఫిర్యాదును తొక్కిపెట్టారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొంతమంది కౌన్సిల్ సభ్యులు మున్సిపాల్టీలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ తనిఖీలు చేయాలని పట్టుబట్టారు. దీంతో అధికారులు తనిఖీలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రూ.5 కోట్లకు పైగా మున్సిపల్ నిధులు దుర్వినియోగమైనట్లు తెలుస్తోంది. విజిలెన్స్ అధికారుల తనిఖీలతో బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడిన వారు బెంబేలెత్తుతున్నారు. విజిలెన్స్ అధికారులు రికార్డులను పరిశీలించి కీలక రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై విజిలెన్స్ అధికారులును వివరణ అడుగగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంకా విచారణ జరుగుతోందని ఇప్పుడే ఏ విషయాలు వెల్లడించలేమని తెలియజేశారు.

PABR డ్యాం

పేరూరు డ్యాం



◆ గ్రీసుకు కూడా నిధుల్లేవు ..!

◆ రెండేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం

మన డ్యాంల భద్రత ఎంత..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర డ్యామ్ గేటు గల్లంతైన నేపథ్యంలో మన జిల్లాలో డ్యామ్‌ల భద్రతపై ప్రస్తుతం చర్చ నడుస్తోంది. నిర్వహణ ఉన్న తుంగభద్ర లాంటి చోటే ఇటువంటి ఘటన చోటు చేసుకుంటే ఇక్కడి పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. అనంతపురం జిల్లాలోని డ్యామ్‌లు గడిచిన నాలుగేళ్లుగా నిర్వహణకు నిధుల్లేకుండా ఉన్నాయి. కొన్ని డ్యామ్‌ల వద్ద పంటకాలువలకు నీరు విడుదల చేసే గేట్లు కూడా పడిపోయి ఉన్నాయి.

డ్యామ్‌లు, పంటకాలువల నిర్వహణ అధ్వాన్నం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అతి పెద్ద రిజర్వాయర్ పెన్నఅహోబిళం రిజర్వాయర్. 11 టిఎంసిల నిలువ సామర్థ్యంతోనున్న ఈ రిజర్వాయర్ నిర్మాణంలోనే లోపముంది. స్పిల్‌వే నుంచే నీరు లీకేజీ అవుతూ ఉంది. దీన్ని నివారించేందుకు సుమారు రూ.10 కోట్లకుపైగా ఖర్చు పెట్టినా ఫలితం లేకుండా ఉంది. పూర్తి స్థాయి నిలువ సామర్థ్యంతో చేయాలంటే జియోమెమ్రైన్ చేయాలని నిపుణులు సూచించారు. ఈ మేరకు అనేక దఫాలుగా ప్రతిపాదనలు సైతం పంపించారు. అయితే దీనిపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. కేంద్ర ప్రభుత్వం తరుపున కూడా ఒక బృందం గతేడాది డ్యామ్ భద్రతా పరిశీలనకు రావాల్సి ఉంది. పాలకుల చొరవ లేకపోవడంతో రాష్ట్రానికి వచ్చిన నిపుణుల బృందం అటునుంచే అటు వెనక్కు వెళ్లిపోయింది. ఇక ఈ డ్యామ్ కూడా రెండేళ్లుగా గ్రీసు పెట్టడానికి కూడా నిధుల్లేకుండా ఉన్నాయి. డ్యామ్‌ల వద్ద ఎంతో కీలకమైన జనరేటర్ కూడా మరమ్మత్తులకు నిధులు విడుదలవలేదు. ఇక మిడ్‌పెన్నార్ , పేరూరు డ్యామ్‌ల పరిస్థితి ఇదే రకంగానున్నాయి. అనుకోకుండా భారీ వరదలొస్తే సమయానికి అవి పనిచేయకపోతే జరిగే నష్టం తీవ్రంగా ఉండే అవకాశాలున్నాయి. ప్రభుత్వాలు వీటి భద్రత నిర్వహణపై కనీస చర్యలు తీసుకుంటున్న దాఖలాల్లేవు.

కాలువల పరిస్థితి దయనీయమే

జిల్లాకు సాగు,తాగునీటిని అందించే ప్రధాన కాలువల పరిస్థితీ దయనీయంగా మారింది. ప్రధానంగా జిల్లాకు శాశ్వత నీటి వనరుగానున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ శిథిలావస్థకు చేరింది. వరదలొచ్చిన సమయంలోనూ కాలువ నిండుగా నీరు తీసుకోవడానికి వీల్లేకుండా 1500 క్యూసెక్కులకు మించి తీసుకుంటేనే ఎక్కడ గండిపడుతుందోనని భయపడాల్సిన పరిస్థితి ఉంది. దీని ఆధునీకరణ పనులు అర్థాంతరంగా ఆగి పోయి ఉన్నాయి. కనీస మరమ్మతుల కోసమైన రూ.30 కోట్లు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఆ నిధులూ విడుదలవలేదు. పిఎబిఆర్‌కు కలిపే లింకు ఛానల్ మధ్యలో ఒకచోట పడిపోయి ఉంది. దాని మరమ్మతులూ జరగలేదు. తాత్కాలిక పనులతోనే సరిపెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సాగునీటి రంగంలోని డ్యామ్‌లు, పంటకాలువల మరమ్మతులపై దృష్టి సారింస్తుదా లేక చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు నష్టం జరిగాక మేలుకుంటుందో చూడాలి.

గుర్తుండిపోయేలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

కలెక్టర్ టిఎస్.చేతన్

కలెక్టరేట్‌లో జాతీయ జెండాను విడుదల చేస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో ఆగస్టు 15వ తేదీన నిర్వహించే 78వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు ప్రజలకు గుర్తుండిపోయేలా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. ఈ వేడుకల నిర్వహణపై సోమవారం స్థానిక కలెక్టరేట్లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల జీవితాలను అంకితం చేసిన మహానుభావుల స్ఫూర్తితో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొనే మంత్రివర్యులతో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, మీడియా, ప్రజలందరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలసి పోలీస్ పరేడ్‌ను పరిశీలించారు. మైదానంలో 10 ప్రభుత్వ ప్రగతిని వివరించే స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. మైదానం చుట్టూ బార్కెట్లు, వాహనాల పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణ, ముఖ్య అతిథిగా పాల్గొని మంత్రి ప్రసంగంలో ప్రగతి గురించి వివరించే నివేదికలు సిద్ధం చేయాలన్నారు. విశిష్ట సేవలు అందించిన అధికారుల ప్రశంస పత్రాల పంపిణీ, విద్యుత్ దీపాల అలంకరణ తదితర అంశాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, అదనపు ఎస్‌పి విష్ణు, డీఎస్పీ వాసుదేవన్, ఎఆర్‌డి ఎస్‌పి విజయ్ కుమార్, తహశీల్దార్ అనుపమ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఆర్అండ్‌బి ఎస్ఈ సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలి

మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజాల నుంచి వచ్చిన 262 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ కొండయ్య, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, ఆర్డీవో భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 15 నుంచి సెప్టెంబర్ 30 వరకు గ్రామాల వారిగా నిర్వహించే రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, తహశీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 45 రోజులపాటు జరిగే రెవెన్యూ సదస్సులకు సంబంధించి తగిన షెడ్యూల్‌ను రూపొందించుకోవాలన్నారు.

ప్రత్యేక పింఛను మంజూరు చేయాలని వినతి

పుట్టపర్తి క్రైమ్ : కదిరి పట్టణం బాబా కాలనీకి చెందిన వికలాంగురాలు వెంకటలక్ష్మి తనకు ప్రత్యేక పింఛను మంజూరు చేయాలని కోరింది. ఈ మేరకు ఆమె సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల వేదికలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు నలుగురు పిల్లలు ఉన్నారని, వారు తనను పట్టించుకోవడంలేదని చెప్పారు. తన భర్త మృతిచెందాడన్నారు. తనకు రెండు చేతులు లేవనిఎవరో ఒకరి సహాయం లేనిదే పూట గడవదని అన్నారు. ప్రస్తుతం తనకు ప్రభుత్వం నుంచి 6వేల రూపాయల వికలాంగ పింఛన్ వస్తోందని, ప్రస్తుత కాలంలో ఆ పెన్షన్ ఏ మేరకు సరిపోవడం లేదని అన్నారు. ప్రభుత్వం తనకు రూ.15వేల పింఛను మంజూరు చేయాలని కోరింది.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

రొద్దం : మండలంలోని సానిపల్లి ఎంపియుపి పాఠశాలకు సోమవారం గ్రామఎంప్లాయిస్ అసోసియేషన్ తరపున రూ. 12వేల విలువ చేసే మైక్ సెట్‌ను అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుకొని మంచి స్థాయిలో స్థిరపడ్డామని తెలిపారు. పాఠశాల పూర్వ విద్యార్థులు మల్లికార్జున, వెంకటేష్ విద్య ఆవశ్యకత, గ్రామ అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్ గౌడ్, ఉపాధ్యాయులు నారాయణస్వామి, కృష్ణానాయిక్, లక్ష్మీనరసమ్మ, జయమ్మ, సత్యమయ్య, లక్ష్మి నారాయణ, మోహన్‌రెడ్డి, ఎస్ఎంసి ఛైర్మన్ శ్రీనివాసులు, వైస్ ఛైర్మన్ నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచులకు శిక్షణ తరగతులు

సోమందేపల్లి : పంచాయతీ విధులు, బాధ్యతలపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీల్లో నీరు, డ్రెయినేజీ, శానిటేషన్, తదితర సమస్యలు, విద్యుత్ బిల్లుల చెల్లింపు, ఇంటి, కుళాయి పన్నుల వసూలు, పంచాయతీ అభివృద్ధి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. స్వాతంత్ర్య, గణతంత్ర్య దినోత్సవాలకు రూ. 10 వేల నుంచి రూ. 25 వేల వరకు నిధులు విడుదల చేయడం హర్షణీయమని సర్పంచులు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లేపాక్షి : సర్పంచులు తమ విధులు, బాధ్యతలను తెలుసుకున్నప్పుడే గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించవచ్చునని శిక్షకులు ఆనంద్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒ సుధీంద్ర అధ్యక్షతన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు నాగేంద్ర, ఆదినారాయణ, నేత్రవతి, అశ్వర్థనారాయణ, పంచాయతీ కార్యద ర్శులు నాగేంద్ర, ఆనంద్‌కుమార్, లక్ష్మప్ప, గంగరత్నమ్మ, ఫరూక్ అబ్దుల్, తదితరులు పాల్గొన్నారు .

రొద్దం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ కేశవరెడ్డి గ్రామ పరిపాలనపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జ్వరాలు, డ్రెయినేజీ, నీరు, వీధిదీపాలు, తదితర సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని సూచించారు.

సోమందేపల్లిలో శిక్షణ తరగతులకు హాజరైన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు

ఇక నుంచి ప్రతి మండలంలో 'గ్రీవెన్స్' : ఎమ్మెల్యే

నేడు కనగానపల్లిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వినూత్న కార్యక్ర మానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా తొలిరోజు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించగా వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి సమస్యలు మొరపెట్టుకున్నారు. ఎమ్మెల్యే ప్రతి ఒక్కరితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇందులో ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో వైసిపి నాయకులు తమ భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని న్యాయం చేయాలని విన్నవించారు. పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాల ని కోరారు. చెన్నేకొత్తపల్లిలో పశువుల సంత ఏర్పాటు, బిసి కాలనీలో ఆలయ నిర్మాణం, స్థానిక ఆసు పత్రిని అభివృద్ధి చేయడంతో పాటు వైద్యులను నియమించాలని విన్నవించారు. తాగు నీరు, నూతన గృహాల మంజూరు, తదితర సమస్యలపై వినతులు అందాయి. వీటిలో కొన్నింటినీ తక్షణమే పరిష్కరిం చాలని, మరికొన్నింటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. బడ్జెట్ కు సంబంధించిన అంశాలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పనులు చేపడుతామని ఎమ్మెల్యే తెలిపారు. ఇక నుంచి ప్రతి మండలంలో గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. ప్రజలు వారి మండలానికి వచ్చినప్పుడు సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. మంగళవారం(నేడు) కనగానపల్లిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామన్నారు.

సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పెనుకొండ డివిజన్ వ్యాప్తంగా విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్ష కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, బిసి వసతి గృహాల్లో పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలను విడుదల చేయాలని, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దారి సరిగా లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే రాబోవు రోజుల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు యువ, సాయితేజ, బాలాజీ, వంశీ, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఎంపి బికె పార్థసారధికి పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న గోరంట్ల సిఐ శేఖర్, హిందూపురం రూరల్ సిఐ జనార్ధన్

ఎంపిని కలిసిన అధికారులు

పెనుకొండ టౌన్ : హిందూపురం ఎంపి బికె.పార్థసారధిని సోమవారం పట్టణంలోని ఎంపి కార్యాలయంలో హిందూపురం రూరల్ సిఐ జనార్దన్, గోరంట్ల సిఐ శేఖర్ వేర్వేరుగా కలిశారు. వారు ఎంపిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు కృషి చేయాలని ఎంపి సిఐలకు సూచించారు. అలాగే కదిరి నియోజకవర్గంలోని నల్లచెరువు వద్ద వెలసిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి శ్రావణమాస మహోత్సవ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు ఎంపిని ఆహ్వానించారు. పెనుకొండ బలిజ సంఘం నాయకులు ఎంపిని మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు శ్రీనివాసులు, ఆకుల వెంకటేషులు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపి పార్థసారధికి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న తహశీల్దార్

రొద్దం : హిందూపురం ఎంపి బికె.పార్థసారధిని నూతన తహశీల్దార్ నాగేంద్ర ఎంపి స్వగ్రామం ఆర్. మరువ పల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు సర్వేయర్ మైనుద్దీన్, డిటి చంద్రశేఖర్, వీఆర్వో రాము ఉన్నారు.

ఉపాధ్యాయుల పని సర్దుబాటుపై ఫ్యాప్టో నిరసన

పెనుకొండలో ఎంఇఒ సుధాకర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ఉపాధ్యాయుల పని సర్దుబాటును బాయ్‌కాట్ చేయాలని ఫ్యాప్టో నాయకులు పిలుపునిచ్చారు. పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు సోమవారం స్థానిక ఎంఆర్‌సిలో ఎంఇఒ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేసిన సంస్కరణల ఫలితంగా రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింద న్నారు. ఇకనైనా ప్రభుత్వం మేల్కొని సమస్యలను చక్కదిద్దాలన్నారు. వివిధ మేనేజ్‌మెంట్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా జీవో-117 రద్దు, జివో-53 మేరకు టీచర్ల కేటాయింపు, ప్రీ ప్రైమరీతో పాటు 1-5 తరగతులు ఒకే పాఠశాలగా నిర్వహణ, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం, హైస్కూళ్లలో రెండు మీడియంల కొనసాగింపు, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకం, బోధనేతర పనుల నుంచి మినహాయింపు, పని భారం తగ్గింపు, విద్యార్థులకు రవాణా సౌకర్యం, మధ్యాహ్నం భోజనం మెనూ సవరణ, మున్సిపల్ టీచర్ల పిఎఫ్ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్లస్ టు స్కూల్స్ ఏర్పాటు, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో సిఆర్‌టిలు, భాషా వాలంటీర్ల నియామకం, మోడల్ స్కూళ్లలో కారుణ్య నియామకాలు, పీజీటీలకు జూనియర్ లెక్చరర్ హోదా, ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం, ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీల భర్తీ, ఎంటిఎస్ ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులర్, ప్లస్ టు పాఠశాలల్లో పిజిటి పోస్టులకు ఉద్యోగోన్నతి, తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో ఛైర్మన్ కోడూరు శ్రీనివాసులు, కో ఛైర్మన్ ఎం.సుధాకర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వైఎస్ఆర్ టిఎఫ్ జిల్లా అధ్యక్షులు కాడిశెట్టి శ్రీనివాసులు, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎపియుఎస్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, అమర చంద్రబాబు, రఘునాథ్, ఆదిజినేష్, రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సోమవారం జరుగుతున్న తాత్కాలిక ఉపాధ్యాయుల సర్దుబాటు కార్యక్రమాన్ని ఫ్యాప్టో ఆధ్వర్యంలో బహిష్కరించారు. అనంతరం స్థానిక ఫ్యాప్టో నాయకులు ఎంఇఒ ఆంజనేయులునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చంద్ర, ప్రధాన కార్యదర్శి సంజీవరాయుడు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణానాయక్, ఏపీటీఎఫ్ నాయకులు జవాజి నాగరాజు, రంగేశ్ కుమార్, దస్తగిరి, సజ్జరాయప్ప, మారుతీప్రసాద్, చౌరెడ్డి, హైస్కూల్ ఉపాధ్యాయులు మధు, కృష్ణమూర్తి, సురేష్‌కుమార్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్, రొద్దం మండల అధ్యక్షులు గంగాధర్, ప్రధాన కార్యదర్శి మారుతి, ఆంజనేయులు, రమేష్, వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు క్రిష్టారెడ్డి, ఉపాధ్యాయులు శివ, రాధమ్మ, శ్రీనివాసులు, అరుణ, భ్రమరాంబ, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కారం చేయాలని కోరుతూ జిల్లా ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఎంఇఒలు శ్రీనివాసభాస్కర్, నరసింహమూర్తి కి వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్, ఎస్‌టియు, టిఎన్‌యుఎస్ఎ ప్రధానోపాధ్యాయ సంఘం నాయకులు కే.భూతన్న, వై.జోగప్ప, చంద్రమోహన్, రామకృష్ణ, లత, మహంతేష్, వెంకటరాముడు, రామ్మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆలయ పర్యాటక వలయం ఏర్పాటుపై సిఎం సానుకూలం'

చరిత్రకారుడు మైనాస్వామి

ప్రజాశక్తి-గోరంట్ల

ఇటీవల అమరావతిలో సిఎం చంద్రబాబుకు ఆలయ పర్యాటక వలయం అభివృద్ధిపై ప్రాథమిక నివేదికను సమర్పించగా, ఆయన సానుకూలంగా స్పందించారని పర్యాటక రంగ నిపుణుడు, చరిత్ర కారుడు మైనాస్వామి తెలిపారు. ఆయన సోమవారం గోరంట్ల మాధవరా యలు గుడిలో విలేకరులతో మాట్లాడారు. సుమారు 459 కి.మీ. పొడవైన ప్రతిపాదిత వలయంలో జరుగబోవు పర్యాటక అభి వృద్ధిని ముఖ్యమంత్రికి వివరించానన్నారు. వలయం ఏర్పాటుపై సిఎం సానుకూలంగా స్పందించడంతో, తాను పూర్తిస్థాయి నివేదికను త్వరలో రూపొందించి, ముఖ్యమంత్రికి అందిస్తానని తెలిపారు. జిల్లాలోని హేమావతితో ప్రారంభమయ్యే పర్యాటక వలయం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తితో ముగుస్తుం దన్నారు. ఈ వలయంలో హేమావతి, పెనుకొండ, లేపాక్షి, గోరంట్ల, మేరెడ్డిపల్లి, మల్లెల, కదిరి, సోమపాళ్యం, వాయల్పాడు, శ్రీనివాస మంగాపురం, చంద్రగిరి, తిరుపతి, గుడిమల్లం, శ్రీకాళహస్తిలోని ప్రసిద్ధ ఆలయాలు, కోటలు-రాజభవనాలు, చారిత్రక ప్రదేశాలున్నాయని తెలిపారు. ఆలయ పర్యాటక వలయం ఏర్పాటుతో ఆయా ప్రదేశాలు అభివృద్ధి చెందడంతో పాటు వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఎపిలో టూరిజం మెగా సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తే రాష్ట్ర సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం లభిస్తుందన్నారు.

అనుమతి లేకుండా మట్టి, ఇసుక తరలిస్తే చర్యలు

లేపాక్షి : అనుమతి లేకుండా మట్టి, ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం తహశీల్దార్ మండలంలోని జేసీబీ, ట్రాక్టర్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అనుమతి లేకుండా ఇసుక, చెరువుల్లో మట్టి తరలిస్తే కఠినమైన చర్యలు తప్పవన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి అపరాధ రుసుము వసూలు చేస్తామన్నారు. ఇసుక, మట్టి రవాణాకు సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ కుమార్‌రెడ్డి, పోలీస్ కానిస్టేబుల్ వెంకటరమణ పాల్గొన్నారు.

గ్లోబల్ జైన్ పాఠశాలలో ఘనంగా గ్రీన్ డే

పెనుకొండ టౌన్ : పట్టణంలోని గ్లోబల్ జైన్ పాఠశాలలో సోమవారం కరస్పాండెంట్ యు.శ్రీనివాసులు అధ్యక్షతన గ్రీన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలు వివిధ కూరగాయలు, పండ్ల వేషధారణలో చూపరులను ఆకట్టుకున్నారు. పాఠశాల వాతావరణం మొత్తం పచ్చదనంతో శోభాయమానంగా కనిపించింది. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మానవ జీవితంలో ఆకుకూరలు, కూరగాయలు, పచ్చదనం, పరిశుభ్రత గురించి కరస్పాండెంట్ పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంజువాణి, డైరెక్టర్స్ సాయి సృజన, సాయి శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధిత ఉపాధ్యాయునికి ఆర్థికసాయం

గుడిబండ : విడపనకల్లు మండలంలోని పాల్తూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు సత్యవరప్రసాద్ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకొన్న గుడిబండ ఎంఇఒ రవిచంద్రకుమార్ ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధ్యాయుల నుంచి రూ. 25 వేలు సేకరించి సత్యవరప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ రవిచంద్రకుమార్, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వక్క రైతులతో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

వక్క రైతులతో 'గుండుమల' ముఖాముఖి

మడకశిర : పట్టణంలోని బాలాజీనగర్ టిడిపి కార్యాలయంలో సోమవారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వక్క రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వక్క చెట్ల పెంపకం, వక్కలు తయారీ విధానం, మార్కెటింగ్ సౌకర్యం, అమరాపురం మండలంలో వక్క మార్కెట్ ఏర్పాటు తదితర అంశాలను గుండుమల రైతులను అడిగి తెలుసుకోవడం జరిగింది. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వక్క రైతులు పాల్గొన్నారు.

ఆమిదాలగొందిలో శివలింగం ప్రతిష్టాపన

మడకశిర రూరల్ : మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన శివాలయంలో సోమవారం శివలింగం ప్రతిష్టాపన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కర్నాటకలోని తుముకూరు జిల్లా సిద్ధరబెట్ట ఆశ్రమం వీరభద్ర స్వామీజీ, పావగడకు చెందిన జపానంద స్వామీజీ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, ఎంపి బికె.పార్థసారధి, మాజీ ఎమ్మెల్యే వైటి.ప్రభాకర్‌రెడ్డి, మద్దనకుంట ఈరన్న, ఆలయ కమిటీ ఛైర్మన్ మంజునాథ్ పాల్గొన్నారు. అంతకుముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు.

చేనేత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోనిరాంనగర్ కు చెందిన చేనేత కుటుంబానికి చెందిన బాలం సాలమ్మ మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేనందున రంగరాజు శిల్క్ హౌస్ యజమాని బండారు నాగరాజు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు జింక చంద్రశేఖర్, సాకే ఓబిలేసు ద్వారా 5వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతా మంజునాథ, గరుగు మల్లికార్జున, నాగరాజు, గోవిందా చారి, దాము, ముత్యాల గౌడ్, నబి రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని చాగలేరు పంచాయతీ కేంద్రంలో నూతన వాటర్ ప్లాంట్‌ను హిందూపురం శాసన సభ్యులు బాలకృష్ణ సతీమణీ నందమూరి వసుంధర సోమవారం ప్రారంభించారు. దాదాపు రూ. 2 లక్షలు వ్యయంతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. గ్రామపంచాయతీ ప్రజలకు శుద్ధజలం అందించాలనే సదుద్దేశ్యంతో ఎమ్మెల్యే సూచన మేరకు వాటర్ ప్లాంట్ ప్రారంభించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత సహాయ కార్యదర్శి శ్రీనివాస్ రావు, సురేంద్రబాబు, బాలజీ, చిలమత్తూరు మండల కన్వీనర్ రంగారెడ్డి, శ్రీదేవి, బేకరీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్.రంగనాథన్ జయంతి

కొత్తచెరువు : గ్రంథాలయ సైన్స్ పితామహుడు పద్మశ్రీ ప్రొఫెసర్ ఎస్సార్ రంగనాథన్ 132వ జయంతి వేడుకలను గ్రంథాలయ అధికారి కె. జయరాం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ రంగనాథన్ గ్రంథాలయాల స్థాపన కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు చంద్రశేఖర్, బాషా, రహమతుల్లా, వలి, భాస్కర్, జిలాన్ పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల ప్రధాన గ్రంథాలయ శాఖలో జాతీయ గ్రంథాలయ దినోత్సవ వేడుకలు గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి పాఠకుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంజలి సౌభాగ్యవతి మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి డాక్టర్ రంగనాథ్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణ, శివమ్మ, రమణ, గంగాధర్, పాఠకులు పాల్గొన్నారు.

జాతీయ పతాకాలు పంపిణీ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

హర్ ఘర్ తిరంగ కార్యక్రమానికి సంఘీభావంగా పట్టణంలోని 15 వార్డులో టిడిపి పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్ ఆధ్వర్యంలో నాయకులు పళ్ళెం కృష్ణ జాతీయ పతాకాలను సోమవారం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ జాతీయ జెండా ఇంటి మీద కట్టి దేశభక్తిని తెలిపి జెండా గౌరవాన్ని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు అంబటి సనత్, యంబ అంజి, భరత్, గిర్రాజు ఆనంద్, పొట్ట ప్రసాదు, నాగరాజు, రాము, శివ, జయ గణేష్, ఇస్మాయిల్, త్రిలోక్, పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-హిందూపురం

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి, తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పీఎం నరేంద్ర మోడీ, సీఎం నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ వాల్మీకి బోయ సంఘం హిందూపురం యువజన సంఘం పార్లమెంట్ అధ్యక్షులు నవీన్ కుమార్, వాల్మీకి సంఘం నాయకులు చోలేమరి రామకృష్ణ, బిఎన్. మూర్తి, కాలవ రాము, సాయి బాబా, కిష్టప్ప, సూగూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

In The Court of The Prl. District Judge, Ananthapuramu
E.P. No:156/2023 in A.A. No:3954/2022
Between :
M/s TVS Credit Services Ltd.Chennai, Rep by its Legal Manager, Ananthapuramu
...Decree Holder
And
1.PIDUGU LAKSHMI DEVI W/O. PIDUGU NARAYANASWAMI, D.NO.4 72 A, PEDDAPANI VEPAMANIPETA, TALUPULA, KADIRI-M, SRI SATHYA SAI DISTRICT.
2.PIDUGU NARAYANA SWAMI, S/O. GANGANNA, D.NO.4 72 A, PEDDAPANI VEPAMANIPETA, TALUPULA, KADIRI-M, SRI SATHYA SAI DISTRICT.
3.NAGI REDDY GARI RAMACHANDRA REDDY, S/o. D.NO.4 72 A, PEDDAPANI VEPAMANIPETA, TALUPULA, KADIRI-M, SRI SATHYA SAI DISTRICT. **...Judgement Debtors**
Notice to J.Dr No:1,2 & 3
పై నెంబరు E.P. లో J.Drs, అయిన మీ హాజరు నిమిత్తం 27/08/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.CHANDRA SEKHAR RAO,
Advocate, Anantapuramu.Cell:9848504780

అవినీతి ,అక్రమాలపై దద్దరిల్లిన కౌన్సిల్ మీట్

కౌన్సిల్‌మీట్‌లో పాల్గొన్న అధికారులు, సభ్యులు

మున్సిపల్ ఆదాయ, వ్యయాలపై రసాభాస

ప్రజాశక్తి - కదిరి టౌన్

మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలపై కౌన్సిల్ మీట్ రసబాసాగా మారింది. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ నజీ మున్నిసా అధ్యక్షతన కౌన్సిల్ మీట్ నిర్వహించారు. కౌన్సిల్ ప్రారంభం కాగానే మున్సిపాలిటీలో నెలకొన్న అవినీతి, అక్రమాలపై సభ్యులు అధికారులను నిలదీశారు. ఇష్టానుసారంగా అవినీతి ,అక్రమాలకు ప్రోత్సహించి పెద్ద ఎత్తున మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారని తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. కౌన్సిల్ ఆమోదం తెలపకముందే ఇష్టానుసారంగా కొన్ని అంశాలను ఆమోదించినట్లు తెలిపి పనులు చేపట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అంతటితో ఆగని కౌన్సిల్ సభ్యులు మున్సిపాలిటీకి చెందిన రికార్డులను చైర్ పర్సన్ ఇంటికి తీసుకువెళ్లడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇందులో ఎవరి పాత్ర ఉందో తేల్చాలని డిమాండ్ చేశారు. బాధ్యతగా ఉండాల్సిన అధికారులు విధులు, బాధ్యతలను విస్మరించడం సమంజసం కాదన్నారు. టిడిపి కౌన్సిలర్ ఫయాజ్ మాట్లాడుతూ కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు. కౌన్సిలర్ కృపాకర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీకి చెందిన అద్దె భవనాలపై అధికారులను ప్రశ్నించారు. నామమాత్రంగా టెండర్లు పిలిచి కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు ఇదే విషయంపై టిడిపి కౌన్సిలర్ ఫయాజ్ కౌన్సిల్ మీట్ దృష్టికి తీసుకువస్తూ సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. డీజల్ పేరుతో భారీ స్థాయిలో అవినీతి చోటు చేసుకుందని ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కృపాకర్ రెడ్డి, ఫయాజ్, ఖాసీం డిమాండ్ చేశారు. అజెండాలో పొందుపరిచిన అంశాలపై కౌన్సిల్ సభ్యులు ప్రశ్నించారు. గతంలో అజెండాలోని అంశాలను కొన్నిటిని పొందుపరిచి చేపట్టిన పనులపై ఆధారాలు చూపాలని కౌన్సిలర్లు పట్టు పట్టారు. కొన్నింటికి సంబంధించి కమిషనర్ వివరణ ఇచ్చారు. కౌన్సిల్ అజెండాలోని పలు అంశాలపై ఎంఎన్ ఫయాజ్ అలీ ఖాన్, కిన్నెర కళ్యాణ్ కుమార్, కృపాకర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో కొన్ని సంవత్సరాల నుండి కౌన్సిల్ సభ్యులుగా కొనసాగుతున్నామని మున్సిపాలిటీలో చోటు చేసుకుంటున్నా అవినీతి ఇతరత్రా వ్యవహారాలపై తమకేం తెలియనట్లు అధికారులు వ్యవహరించడం సబబు కాదన్నారు. అనంతరం అజెండాలోని కొన్ని అంశాలను కౌన్సిల్ సభ్యులు తిరస్కరించారు.

పాడిరైతుల ఆందోళన

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

రోడ్డుపై పాలను పారబోస్తూ రైతుల నిరసన

పాడిరైతులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు పాల సేకరణ రైతులు పాలను కిందికి పోసి నిరసన తెలిపి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సత్య సాయి జిల్లా అధ్యక్షులు అడపాల వేమ నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన అమూల్ కంపెనీ రైతుల నుండి పాలనుసేకరిస్తూ జిల్లాలో గణనీయమైన పాల దిగుబడిని సాధించేలా రైతులను ప్రోత్సహించిందన్నారు. ప్రభుత్వం మారడంతో ఉన్నఫలంగా అమూల్ కంపెనీ పాల సేకరణను ఆపివేసిందన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి పాడి రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతన్ కు వినతిపత్రం అందజేసి తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు కాశీ విశ్వేశ్వరరావు, సహకార సంఘ సభ్యులు అమరావతి, మహేష్, మంజు తదితర పాడి రైతులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఇళ్లస్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న సాకే నరేష్

బీసీ న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర కన్వీనర్ సాకే నరేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో సోమవారం సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో నరేష్ మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలో ఉన్న బీసీ న్యాయవాదులకు 3 సెంట్లలో స్థలం కేటాయించి ఇళ్లు మం జూరు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం పీపీ, ఏపీపీ, ఏజీపీల పోస్టులు కేటాయింపులలో బీసీలకు సముచిత స్థానం కేటాయించాలన్నారు. బీసీ న్యాయవాదుల పై జరుగుతున్న దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బీసీ న్యాయవాదుల జిల్లాస్థాయి కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా మేకల రామాంజినేయులు, ఉపాధ్యక్షులుగా కురుబ బన్నీల మహేశ్, ప్రధానకార్యదర్శిగా అశోక్‌కుమార్, కోశాధికారిగా కిషోర్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా బిల్లే నరేంద్రతోపాటు 36 మంది న్యాయవాదులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి - కొత్తచెరువు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ అన్నారు. కొత్తచెరువులోని మార్కెట్ యార్డ్‌లో పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాసంఘాల నాయకులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ లో రైతులు పంట సాగు చేశారని రైతులకు తక్షణమే రైతు భరోసాను అందజేయాలని అన్నారు. రైతులకు సబ్సిడీ పైన ప్రత్యామ్నాయ విత్తనాలను వ్యవసాయ పనిముట్లు అందించాలన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామకృష్ణ, ప్రాంతీయ కార్యదర్శి అంజి, సిఐటియు మండల కార్యదర్శి ముత్యాలు, శంకర్ రెడ్డి, నాగమణి, రామాంజనేయులు, లక్ష్మయ్య, పెద్దన్న పాల్గొన్నారు.

ఆర్టీసీకి నష్టం వాటిల్లుతున్నా పట్టదా.? : సిపిఎం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ప్రైవేటు బస్సుల ద్వారా ప్రజా రవాణా వ్యవస్థ ఆర్టీసీకి నష్టం వాటిల్లుతున్న ఆర్టీసీ అధికారులకు పట్టదా అని సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్ నరసింహులు ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీకి నష్టం కలిగించే విధంగా కొన్ని ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు ఆర్టీసీ బస్సుల ముందర తమ బస్సులను ఇష్టాసారం నడిపిస్తున్నారని విమర్శించారు. కదిరి బెంగళూరు మధ్య వయా చింతామణి మీదుగా ఉదయం 5:30 గంటలకు నడుస్తున్న ఆర్టీసీ బస్సు సర్వీసును నష్టాల పేరుతో ఇటీవలే రద్దు చేశారు. ప్రవేటుకున్న ఆదాయం ఆర్టీసీకి ఎందుకు లేదని ప్రశ్నించారు. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి ఇలా వ్యవహరించడం సరైంది కాదని అన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు మేల్కొని ప్రయివేటునుకట్టడి చేసి ఆర్టీసీని కాపాడాలని సూచించారు.

హాస్టల్ భవన నిర్మాణ పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వెనుక 10 సంవత్సరాల కిందట ప్రారంభించిన రెండు అంతస్తుల బాలికల హాస్టల్ భవనాన్ని పూర్తిచేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పవన్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ టిఎస్ చేతన్‌కు సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు మంజూరు కాకపోవడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. తక్షణమే నిధులు కేటాయించి మరమ్మత్తులు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ భవనం లేనందున అద్దె భవనంలో కొనసాగుతున్నదని అక్కడ సరైన సదుపాయాలు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటును ఆపాలి : ఫ్యాప్టో

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

అసంబద్ధమైన ఉపాధ్యాయ సర్దుబాటు చర్యలను వెంటనే ఆపాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల విద్యాశాఖ అధికారి సురేష్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీవో నెంబర్ 117 ప్రకారం చేస్తున్న అసంబద్ధమైన వర్క్ అడ్జస్ట్మెంట్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు తెలిపారు. 2020 లో విడుదలైన జీవో నెంబర్ 53 ప్రకారం వర్క్ అడ్జస్ట్మెంట్ చేయాలని పని సర్దుబాటు ప్రక్రియలో సీనియర్ బిల్లింగ్ అవకాశం కల్పించాలని 16 ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో కో చైర్మన్ గౌస్ లాజమ్, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాంకుమార్, ఎపిటిఎఫ్ మనోహర్, యూటిఎఫ్ శ్రీ నివాసులు, వైఎస్ఆర్‌టిఎఫ్ సుధాకర్ నాయక్, డిటిఎఫ్ చంద్రమౌళి, చంద్రమోహన్, యంటిఎస్ ఉపాధ్యాయులు కృష్ణ ప్రసాద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : ఉపాధ్యాయుల పని సర్దుబాటును ప్రభుత్వం చేపడుతున్నందున పాఠశాలలు నిర్వీర్యం కానున్నాయని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పివి రమణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చాలా పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయునితో నడపడం వల్ల బోధన కొంటుపడుతుందన్నారు. ఐదవ తరగతి వరకు ఒకే ఉపాధ్యాయునితో బోధన ఎలా సాధ్యమన్నారు. 495 మంది ఉన్న విద్యార్థులు ఉన్న ఉన్నత పాఠశాలలో 3 నుంచి 10 వరకు ఒకే తెలుగు ఉపాధ్యాయుడు ఏ విధంగా బోధిస్తాడని ప్రశ్నించారు. జిల్లాలో 120 మంది తెలుగు ఉపాధ్యాయులు ఉన్నారని అనవసరంగా పని సర్దుబాటు చేయడం సరైంది కాదని అన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలన్నారు. అవసరమైన పాఠశాలలకు అదే మండలంలోని అర్హులైన వారిని పని సర్దుబాటు చేస్తే చాలని దీనికి రాష్ట్రస్థాయి నుంచి చేయాల్సిన పనిలేదని అన్నారు. ఉపాధ్యాయులకు బోధ నేతర పనులు అప్పగించకూడదన్నారు. తాము ఈ సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

ధర్మవరం టౌన్ : అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎపిటిఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఇఒ గోపాల్‌నాయక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీకే ముత్యాలప్ప, కె.బలరాముడు, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులు, యుటిఎఫ్ నాయకులు ఆంజనేయులు, రామక్రిష్ణనాయక్. విజయభాస్కర్ తదతరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని సిపిఎం నాయకులు కుళ్లాయప్ప, శ్రీరాములు పేర్కొన్నారు సోమవారం స్థానిక తహశీల్దార్‌కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జూనియర్ అసిస్టెంట్ భరత్‌కు అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలకు ఇల్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. సచివాలయాల్లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కేశవ , శ్రీనివాసులు, మిట్టపల్లి శ్రీరాములు, జయమ్మ, వరలక్ష్మి, అంజనమ్మ, తొలిసమ్మ, గంగ, రత్న, శ్రీదేవి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ నాగరాజుకు సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రామకృష్ణ, డివిజన్ కార్యదర్శి బాళ్ల అంజి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో కొత్తచెరువు మేజర్ పంచాయతీలో మూడు లేఅవుట్లలో 850 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారన్నారు. అయితే ఈ లేఅవుట్‌లో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని విమర్శించారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వలేదన్నారు. ఇందులో ఖాళీ స్థలాలు గుర్తించి అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ముత్యాలు, కో కన్వీనర్ శంకర్ రెడ్డి, మహిళా సంఘం నాయకురాలు శ్రావణి, నాగమణి, లక్ష్మయ్య, రామాంజనేయులు, సాలమ్మ, ఈశ్వరమ్మ, నాగలక్ష్మి, శాంతమ్మ, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు విశ్రాంతి స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-హిందూపురం



వసుంధర దేవికి వినతిని అందజేస్తున్న హమాలీలు

హిందూపురం పట్టణంలో మున్సిపల్ కూరగాయల మార్కెట్ సముదాయ భవనం సమీపంలో తమకు విశ్రాంతి స్థలం కేటాయించాలని హమాలీలు కోరారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర దేవికి వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా హమాలీలు మాట్లాడుతు కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న గాంధీ సర్కిల్లో తమకు విశ్రాంతి తీసుకోవడానికి గతంలో ప్రత్యేకంగా ఒక స్థలం ఉండేదన్నారు. అయితే కూరగాయల మార్కెట్ నూతన సముదాయ భవనం నిర్మించడంతో తాము ఉన్న స్థలం కూడా మున్సిపాలిటీ వారు మార్కెట్ సముదాయ భవనానికి హద్దులు వేశారన్నారు. దీంతో గత 6సంవత్సరాలుగా విశ్రాంతి తీసుకోవడానికి స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. నిత్యం పెద్ద పెద్ద దుకాణాలు, బస్సుల వద్ద బియ్యం, రాగులు మూటలు, ఐరన్ స్తంభాలు ఎత్తడం, బస్సుల వద్ద లగేజ్ లోడ్ అన్ లోడ్ చేయడం చేస్తుంటామని ఆ పనులు చేసే సమయంలో విపరీతంగా అలసి పోతామని చెప్పారు. కాస్త విశ్రాంతి తీసుకోవడానికి తగిన స్థలం లేక పోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థలం కేటాయిస్తే అక్కడ విశ్రాంతి తీసుకోవడానికి అవకాశం ఉందని వారు కోరారు. దీనిపై స్పందించిన వసుంధర దేవి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

నేరాలు ఘోరాలు

బస్సులో ప్రయాణికురాలి బంగారం చోరీ

పంపకాల కోసం ఘర్షణతో పట్టుబడిన దొంగలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

బస్సులోని ప్రయాణికురాలు వద్ద బంగారాన్ని చోరీ చేసి, పంపకాల వద్ద తేడా రావడంతో ఘర్షణ పడుతున్న దొంగలు పోలీసులకు పట్టుబడి కటకటాల పాలయ్యారు. సోమవారం సాయంకాలం జరిగిన చోరీ సంఘటనకు సంబంధించి బాధితురాలు.. పోలీసులు తెలిపిన వివరాలు... పుట్లూరు మండలం మడుగు పల్లికి చెందిన కురబ కోరే మోహనయ్య భార్య రాధమ్మ ఆదివారం మండలంలోని యర్రాయపల్లి గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చింది. సోమవారం ధర్మవరం వెళ్లి చీరలు కొనుగోలు చేసి అనంతరం బత్తలపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా తన మెడలో ఉన్న 8 తులాల బంగారు నగలను బ్యాగులో ఉంచుకొని స్వగ్రామానికి వెళ్లడానికి నార్పల బస్సు ఎక్కింది. అయితే అదే బస్సులో ముగ్గురు మహిళా దొంగలు ఎక్కారు. వెంకటగారిపల్లి బస్సు స్టేజ్ సమీపాన బాధితురాలు చేతిలోనే బ్యాగును చాకచక్యంగా తస్కరించి మాల్యవంతం వద్ద బస్సులో నుండి మహిళా దొంగలు దిగిపోయారు. బస్సు కొంత దూరం వెళ్ళగానే బాధితురాలు రాధమ్మ తన వద్ద గల బంగారు నగల బ్యాగు అపహరణకు గురైందంటూ అరుస్తూ బస్సులో నుంచి క్రిందికి దిగింది. అటువైపు నుండి ద్విచక్రవాహంలో వస్తున్న టీచర్ ఈమె పరిస్థితిని గమనించి బాధితురాలిని ద్విచక్ర వాహనంలో ఎక్కించుకొని మాల్యవంతం వద్దకు వెళ్లి అక్కడ దిగిన మహిళల గురించి విచారించారు. ఆటోలో బత్తలపల్లి వైపు వెళ్లినట్లు అక్కడున్నవారు చెప్పడంతో టీచర్ బాధితురాలితో కలసి బత్తలపల్లికి వస్తుండగా గ్రామ సమీపాన నర్సరీల వద్ద ఈ ముగ్గురు మహిళలు కన్పించారు. వారు తాము చోరీ చేసిన బంగారాన్ని పంచుకోవడంలో ఘర్షణ పడుతుండటాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు ముగ్గురు మహిళా దొంగలను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి తమదైన శైలిలో విచారించారు. చోరీ చేసిన లాంగ్ చైన్, కమ్మలు, రాళ్ల నక్లేస్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని బాధితురాలికి అందజేశారు.

పెట్రోల్‌బంక్ లైసెన్స్ మంజూరుకు రూ. 2 లక్షలు డిమాండ్

కలెక్టర్‌ను ఆశ్రయించిన బాధితుడు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పెట్రోల్ బంక్ లైసెన్సు మంజూరుకోసం రూ. 2లక్షలు డిమాండ్ చేస్తున్నారంటూ నల్లమాడ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి జిల్లా కలెక్టర్ చేతన్‌కు ఫిర్యాదు చేశాడు. జిల్లా పౌరసరఫరాధికారి వంశీకృష్ణారెడ్డి పెట్రోల్ బంక్ లైసెన్స్ మంజూరు విషయంలో 2 లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నారంటూ ప్రజా పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్‌కు పెట్రోల్ బంకు మేనేజర్ చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. తనకు జరిగిన అన్యాయాన్ని బాధితుడు ఈసందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. నల్లమాడ మండలం రెడ్డిపల్లి గ్రామంలో అభియా ఎంటర్‌ప్రైజెస్ పేరిట షెల్ పెట్రోల్ బంక్ 2019 ఫిబ్రవరి లో ప్రారంభించామన్నారు. అప్పటినుండి ఇప్పటివరకు పెట్రోల్ బంక్ నిరాటంకంగా కొనసాగుతోందన్నారు. జీఎస్టీ బిల్లులతోపాటు టాక్స్ లు ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామన్నారు. ఇది ఇలా ఉండగా పెట్రోల్ బంక్ ఫాం బి మంజూరు చేయడంలో పౌర సరఫరా అధికారులు నిర్లక్ష్యం వహించారని ఫాం బి మంజూరు చేయాలంటే 2 లక్షల రూపాయలు ఇవ్వాలని వంశీకృష్ణారెడ్డి డిమాండ్ చేశారని పెట్రోల్ బంక్ మేనేజర్ చంద్రశేఖర్ కలెక్టర్ టీఎస్ చేతన్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే లక్ష రూపాయలు నగదు ఇచ్చినట్లు చంద్రశేఖర్ తెలిపారు. నిబంధన ప్రకారం తమ వద్ద ఏయే పత్రాలు కావాలో అన్నీ ఉన్నట్లు కలెక్టర్ ముందు పత్రాలను చూపించాడు. తనకంటే వెనుక వచ్చినవారికి రెండు వారాల్లోనే లైసెన్సు మంజూరు చేశారన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ టిఎస్ చేతన్ సీరియస్ గా తీసుకొని వంశీకృష్ణారెడ్డి ఎక్కడ అని అరా తీశారు. ఆయన లేరనలీవ్ లో వెళ్ళాడని అధికారులు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి ఇప్పటికే రెండు సార్లు ఫిర్యాదు చేశానని ఈరోజు మూడోసారి ఫిర్యాదు చేస్తున్నానని బాధితుడు చంద్రశేఖర్ తెలిపాడు. తనకు న్యాయం చేయాలని బాధితుడు ఈసందర్భంగా కలెక్టర్‌ను కోరారు.

చోరీల కేసులో నిందితుడు అరెస్టు

16 తులాల బంగారం, వెండి స్వాధీనం

ప్రజాశక్తి బత్తలపల్లి

తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసి అతని వద్ద నుండి 16 తులాల బంగారం,వెండిని స్వాధీనం చేసుకున్నట్లు బత్తలపల్లి ఎస్ఐ పి. శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడించారు. ఈనెల మూడవ తేదీన మండలంలోని అనంతసాగరం గ్రామానికి చెందిన కురబ కొండమ్మ ఇంటిలో చోరీ కేసును ఛేధించడానికి డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సిఐ ఆరోహణరావు ప్రత్యేకంగా టీమును ఏర్పాటు చేశారన్నారు.ఉమ్మడి జిల్లాలో 37 కేసులలో నిందితుడుగా ఉన్న అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులును సోమవారం అరెస్టు చేసి విచారించామన్నారు. నార్పల మండలం బొందలవాడ గ్రామంలో తాళం వేసిన ఇంటిలో చోరీ చేసినట్లు నిందితుడు అంగీకరించాడన్నారు. నిందితుడి నుండి 16 తులాల బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు జల్సాలకు అలవాటు పడి తాళం వేసిన ఇళ్ళను ఎంచుకొని చోరీలకు పాల్పడుతుండేవాడన్నారు. నిందితుడిని సోమవారం రాత్రి పెనుగొండ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. చోరీ కేసును ఛేదించిన పోలీస్ కానిస్టేబుల్ సుదర్శన్ నాయుడు, జనార్ధన్, అనిల్ కుమార్‌ను డిఎస్పి, సిఐ, ఎస్ఐ అభినందించారు.

ఆకతాయిలపై సిఐకు ఫిర్యాదు

కదిరి అర్బన్ : స్థానిక రాజీవ్ గాంధీనగర్, అమీన్ నగర్, కందికుంట నారాయణమ్మ నగర్, బాబా కాలనీ పరిసర ప్రాంతాల్లో గంజాయి మత్తులో యువత భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయా ప్రాంత ప్రజలు సిఐ నారాయణరెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. బయట యువకులు వచ్చి గంజాయి మత్తులో గొడవలు చేస్తూ సామాన్య ప్రజలకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారు వాపోయారు. చిన్నచిన్న వీధులలో సాయంకాలం ద్విచక్ర వాహనాలలో అతివేగంగా వెళుతూ ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సిఐ స్పందిస్తూ రాత్రి గస్తీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి చైతన్య, సీనియర్ నాయకులు శేషు, చెన్నకేశవులు, శ్రీనివాసులు, నౌషాద్, పంచి రమణ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

చట్ట పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని, ఆదిశగా పోలీసు అధికారులు ఫిర్యాదుదారులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చూడాలని జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జరిగింది. అర్జీదారులతో జిల్లా ఎస్పీ వి.రత్న ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వరమే బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, దిశా డీఎస్పీ శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, ఎస్‌బి సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, సీసీ రాఘవేంద్ర, డిసిఆర్‌బి సిఐ హర్ష, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట : జిల్లాలో అసాంఘిక శక్తుల కార్యకలాపాలను ఇక సాగనివ్వమని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ వి. రత్న అన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం ఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో పెరిగిపోతున్న నేరాలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లో సిబ్బందిని అప్రమత్తం చేసి ఆయా స్టేషన్ల పరిధిలో వాటిని అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటామని, ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడిన నేరస్తులు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ శాతం నేరాలు జరిగిన పల్నాడు తర్వాత గోరంట్ల మండలం పేరు వచ్చిందని గతం నుండి జరుగుతున్న నేరాల విషయంలో జిల్లాలోనే గోరంట్ల ప్రథమ స్థానంతో ఉందని అన్నారు. కర్నాటక మద్యం ,గంజాయి, ఇసుక అక్రమ రవాణా, మహిళలపై దాడి, భూకబ్జాల విషయంలో గోరంట్ల మండలం ఉందని వీటిని అరికట్టడానికి నేరాల శాతం తగ్గించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోరంట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని నూట ఒక్క గ్రామాలను మూడు సెక్టార్లుగా విభజించి నిజాయితీగల అధికారులను నియమించి పరిస్థితులను మెరుగుపడేందుకు కృషి చేస్తామని తెలిపారు. గోరంట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో జరిగిన కొన్ని సంఘటనలపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్ విష్ణు, దిశా డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, సిసి రాఘవేంద్ర, ఆర్‌బి సి ఐ శ్రీ హర్ష పోలీసులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని బైరాపురం పంచాయతీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. కిత్మత్ ఏ హల్క్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శామీర్, ఆధ్వర్యంలో పుట్టపర్తికి చెందిన శ్రావణ్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. పాఠశాలలోని40 మంది విద్యార్థులకు పలకలు, రైటింగ్ ప్యాడ్స్, నోటుపుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు కాంచన, ఉపాధ్యాయులతో పాటు నాయకులు షాకీర్, శివ, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ :మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామాగ్రిని సోమవారం పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్య విద్యాశాఖమంత్రి వై.సత్యకుమార్ కుమార్తె సంస్కృతి జన్మదిన సందర్భంగా ఎంపిపి గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు తదితర సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిల్లుకుళ్లాయప్ప, ఓబిరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

బాల్ బాడ్మింటన్ క్రీడలో జాతీయస్థాయికి ఎదగాలని ఆత్మీయ ట్రస్టు ప్రతినిధులు మేడాపురం రామిరెడ్డి, శెట్టిపి జయచంద్రారెడ్డి, సూర్యప్రకాశ్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ మేరకు స్థానిక బాలుర ఉన్నతపాఠశాల ఆవరణంలో ఆత్మీయ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్ బ్యాడ్మింటన్ క్రీడాసామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో మెళుకువలను పాటిస్తే తప్పక రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శైలజ. హిందీ పండిట్ వేణుగోపాలాచార్యులు, ఉపాధ్యాయులు ప్రసాద్‌బాబు, శ్రీనివాసులు, సునీతమ్మ, లలితమ్మ, హరికృష్ణ, రామాంజినేయులు, పీడీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు ఎంపిడిఓగా నరేష్‌కృష్ణ

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు ఎంపిడిఓగా నరేష్‌కృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన అనుభవంతో మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఈసందర్భంగా ఆయన చెప్పారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, శాఖ మంత్రి వై. సత్య కుమార్ కుమార్తె సంస్కృతి పుట్టినరోజు సందర్భంగా సోమవారం ధర్మవరం మండలం గొట్లూరు అనాధ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. చేనేత నాయకులు గిర్రాజు నగేష్, మంత్రి సత్య కుమార్ పిఎ హరీష్ ఆధ్వర్యంలో వృద్ధులకు, అనాధలకు దుప్పట్లు, పండ్లు,అన్నదానం చేశారు ఈ కార్యక్రమంలో సాకే ఓబిలేసు, జింకా చంద్ర శేఖర్ గిర్రాజు రాజు గూడూరు వెంకటేష్, వెంకి మొహిద్దీన్, బృందం తదితరులు పాల్గొన్నారు. దాతలకు ఆశ్రమం ఫౌండర్ ఎల్. ప్రవుల్ల చంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుతో సామాన్యులకు ఊరట

ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి

ఇంటిపన్ను దరఖాస్తును స్వీకరిస్తున్న వసుంధరదేవి, తదితరులు

ప్రజాశక్తి- హిందూపురం

గత ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకోచ్చిన ల్యాంగ్ టైటలింగ్ యాక్టు రద్దుతో సామాన్యులకు ఊరట లభించడతో పాటు వారి ఇళ్లకు, స్థలాలకు పన్ను విధించడానికి సాధ్యం అయిందని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి అన్నారు. సోమవారం హిందూపురం పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఆస్తి పన్నుల క్రమబద్దీకరణ వారోత్సవాల కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వసుంధర దేవి మాట్లాడుతు పట్టణ ప్రజల కష్టాలను తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపి ఆస్తిపన్ను చెల్లింపునకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారన్నారు. త్వరలో హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా కోట్లాది రూపాయలతో అభివృద్ది కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నామన్నారు. అనంతరం ఇంటి పన్నుల దరఖాస్తులను కమిషనర్ తో కలిసి వసుంధర దేవి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజక వర్గ సమన్వయ కర్త శ్రీనివాస రావు, పట్టణ అధ్యక్షులు, కౌన్సిల్ ప్రతి పక్ష నేత రమేష్ కుమార్, పలువురు కౌన్సిలర్లతో పాటు మున్సిపల్ రెవిన్యూ అధికారులు సుధాకర్, రాము, రామాంజినేయులు తదితరులతో పాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

హిందూపురం పట్టణంలోని ఐదు లాంతర్ల కూడలిలో చేపట్టిన లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణం కోసం పలువురు దాతలు ముందుకొచ్చి వసుంధర దేవి చేతికి విరివిగా చెక్కుల రూపంలో విరాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు జెఈ వెంకట స్వామి, అధ్యక్షులు రాఘవేంద్ర, కార్యదర్శి నిమ్మకాయల రాము, రమేష్ కుమార్, టిడిపి నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేద్దాం

కదిరిలో నిర్వహిస్తున్న ర్యాలీ

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఎయిడ్స్ రోగుల పట్ల ఆదరణ, సానుకూలత కనబరుస్తూ వారిలో భరోసా నింపాలని పలువురు వక్తలు పేర్కొన్నారు.సోమవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సును ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగమణి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ భారతి మాట్లాడుతూ రూర్బన్‌లక్ష్మీ కమ్యూనిటీ ఆర్గనైజేషన్ సంస్థ బత్తలపల్లిలో దాదాపు 7 సంవత్సరాల నుంచి హెచ్ఐవి పాజిటివ్ రోగుల ఆరోగ్య స్థితిగతులపై పనిచేస్తోందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ తేజశ్రీ మాట్లాడుతూ హెచ్ఐవి వచ్చిన వారిపట్ల సానుకూలత కనబరుస్తూ వారికి భరోసా ఇచ్చినప్పుడే ఆరోగ్యంగా జీవించగలరన్నారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది విహాన్, సతీష్, జయలక్ష్మి, మంజునాథ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : విద్యార్థులు హెచ్ఐవి పట్ల అవగాహన కలిగి ఉండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ స్మిత సూచించారు. సోమవారం జన జాగృతి ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కదిరి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లో ఇంటర్నేషనల్ యూత్ డే పురస్కరించుకొని హెచ్ఐవి పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కదిరి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ స్మిత, అధ్యాపకులు, సిబ్బంది, జన జాగృతి ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : శక్తిమైత్రి మహిళ సంఘంఆధ్వర్యంలో సోమవారం ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ మాధవి మాట్లాడుతూ హెచ్ఐవీ, సుఖవ్యాదుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ వైద్యాధికారి నజీర్, గైనకాలజిస్టు వైద్యురాలు శైలజ, తదితరులుపాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో అనర్థాలు

ప్రజాశక్తి-హిందూపురం

చెడు వ్యసనాల వల్ల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు సమాజంలో గౌరవ మర్యాదలు క్షీణిస్తాయని వక్తలు పేర్కొన్నారు. వ్యసనాలు పర్యావసనాలు అనే అంశంపై సోమవారం స్థానిక బిట్ ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా డి-అడిక్షన్ సెంటర్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ సాయి శృతి మాట్లాడుతూ డి-అడిక్షన్ అనే ప్రక్రియకు రోగి నుండి చాలా సమయం, సహనం, సహకారం అవసరం అన్నారు. వ్యసనాల వల్ల ఆరోగ్యం పాడవుతుందని, కుటుంబ సభ్యులతో ప్రేమానుబంధాలు తగ్గిపోతాయని, జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని తెలిపారు. ముఖ్యంగా 12 నుండి 18 సంవత్సరాల మధ్య వయసున్న యువత వ్యసనాలకు తొందరగా బానిసవుతున్నారని, అలాంటి యువత కోసం తమ సంస్థ ఉచితంగా మందుల పంపిణీ, అవగాహన, యోగా థెరపీ వంటివి నిర్వహిస్తోందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ రమేష్, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంచాయతీ విధులు, బాధ్యతలపై సర్పంచులకు అవగాహన

బత్తలపల్లిలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారి

ఓబుళదేవర చెరువులో నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న అధికారులు, సర్పంచులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

పంచాయతీ సర్పంచులు గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన విధులు, బాధ్యతలు తెలుసుకున్నప్పుడే గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడిపించవచ్చునని ఎంపిడీవో సాయిమనోహర్ పేర్కొన్నారు. సోమవారం బత్తలపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సాయిమనోహర్ అధ్యక్షతన జరిగిన మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పంచాయతీరాజ్ చట్టం మేరకు బాధ్యతలు, అధికారాలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ దివాకర్, ఏవో శ్రీదేవి, గ్రామ పంచాయితీల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : గ్రామ పంచాయతీల అభివృద్ధిపై మండలంలోని సర్పంచులకు, కార్యదర్శులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షులు పర్వీన్ భాను అధ్యక్షతన సూపరింటెండెంట్ రెడ్డప్ప ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో పరిపాలన అంశాలు ప్రభుత్వ పథకాల నిర్వహణ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు తదితర అంశాలపై మూడు రోజులు సర్పంచులకు కార్యదర్శులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు సర్పంచుకు మూడు రోజులు పాటు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీవో కె.రామానాయక్ మాట్లాడుతూ మూడు రోజులు పాటు ఇచ్చే ఈ శిక్షణలో గ్రామాలకు అందే ప్రభుత్వ పథకాలు, గ్రామస్థాయి పరిపాలన, మౌలిక సౌకర్యాలు తదితర వాటిపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ సునీత, పంచాయతీ కార్యదర్శులు శంకర్, రవికుమార్, భవాని, సర్పంచులు రవి నాయక్, శివప్పనాయుడు, సుధాకర్, శాంతమ్మ, లక్ష్మీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు